# అద్వితీయం

''సూర్యం, సూర్యం!'' అంటూ వాడింటిముందు నిలబడి రెండుమూడు సార్లు కేకేసేను.

''అబ్బబ్బ! చెవికోసిన మేకల్లాగ ఎవడో ఒకడు....'' అంటూ తలుపు తీసుకుని వాడితల్లి గం. భ. స. జానికమ్మ ప్రత్యక్షమై నన్ను చూసి, ''నువ్వట్రా? లోపలికి రా!'' అంటూ తలుపు బార్లా తీసింది.

''ఏనేం లేదు. ఈ వీధంట వెడుతూ వున్నాడేమో పలకరిద్దామని పిలిచేను" అంటూ రెండు మెట్లెక్కేను.

"లేడు. పొద్దున్నే వెళ్ళేడెక్కడికో'' అంటూ చావుకబురు చెప్పింది.

''సరే వస్తా'' అన్నాను వెనక్కి తిరుగుతూ.

''లోపలికి రారా. నీతో ఓ నిమిషం మాట్లాడాలి'' అంది హాల్లోకి అడుగేస్తూ.

ఒక్క క్షణం తటపటాయిస్తూ, తప్పదన్నట్టు మెట్లెక్కుతూ ఆలోచనలో పడ్డాను. సూర్యం నాకు దగ్గిర బంధువు. అడిగినప్పుడల్లా పాతికాపరకా అప్పిస్తూంటాడు అందేత ఆత్మబంధువు కూడాను. ఇప్పుడు నే నొచ్చింది కూడా అలాంటి పనిమీదేనని పసికట్టి లోపలికి రమ్మంటుందేమోనన్న భయంతో మెట్లెక్కుతుంటే గుండెలు దడదడలాడుతున్నాయి, కాళ్ళు తడబడుతున్నాయి. ఆర్థికంగా చితికిపోయిన మా కుటుంబం అంటే ఆవిడ కేనాడూ గౌరవం లేదు. నేను వర్ణాంతర వివాహం చేసుకున్నాక మా కుటుంబాన్ని పూర్తిగా వెలేసింది. ఆవిడ కడుపున సూర్యం తప్పబుట్టేడు. వాడికి నేనన్నా శంకరమన్నా ప్రాణం.

''నువ్వు సూర్యాన్ని కలుసుకుని ఎన్నాళ్ళయింది?'' అంటూ కుర్చీలో కూర్చుని నన్ను కూడా కూర్చోమని సౌజ్ఞ చేసింది. అది సందేహమో, ప్రశ్నో, హెచ్చరింపో అర్థం కాలేదు.

''పదిరోజులయినట్టుంది'' అన్నాను.

''అదీ అలా చెప్పు. వాడి పరిస్థితేం బాగాలేదురా!'' అంది.

''ఏఁ - ఏమయిందీ?" అని అడిగేను, వాడిక్కూడా ఆర్థిక యిబ్బందు లుంటాయని చెప్పదల్చుకుందేమోనని అనుమానిస్తూ.

''శంకరం చెప్పలేదా?'' అంది.

సదరు శంకరం మా తమ్ముడు. నా దగ్గిరేవుండి ఇంజనీరింగ్ కోర్స్ చదువుతున్నాడు. వీతంతు క్షేమమైన వాళ్ళ నాన్నలాగే సూర్యంకూడా సుద్ద సాధారణ సాత్వీకుడు. సిగరెట్టయినా కాల్చడు. కనీసం పేకాటయినా నేర్పి పీణ్ణి మనిషిని చేద్దామని చూస్తుంటే, మా శంకరం వీడికి తోడుగా సినీమాలకి పోతూ నా దారి కడ్డం తగుల్తున్నాడు.

''లేదు'' అన్నాను.

''ఓసారి కలుసుకుని వాడి వాలకం చూడు. ఉద్యోగానికి కూడా శలవు పెట్టేసి, గెడ్డం మీసం పెంచేసేడు. ఇంక రేపోపాపో సన్యాసుల్లో చేరడానికి సిద్ధంగా వున్నాడు'' అంది కంట తడిబెడుతూ.

"అదేం రోగం!''

''అంతా నా తలరాత నాయనా! వాడికిరవయ్యేడేళ్ళొచ్చేయి. ఒక్కగా నొక్క కొడుకు, కావల్సినంత ఆస్తి, మంచి వుద్యోగం. ఇవన్నీ చూసి లక్షలు కట్నాలు గుమ్మరిస్తామంటూ బంగారంలాంటి సంబంధాలొస్తుంటే రెండేళ్ళనుంచి పిల్లనైనా చూడకుండా, ఏదో వొంక పెట్టి, ఒద్దుపొమ్మన్నాడు. ఈ మధ్య పెళ్ళి మాటెత్తితే హనుమంతుడు, బుద్ధుడు, శంకరాచార్యుడు, వివేకానందుడు అంటూ వేదాంతం చెబుతున్నాడు'' అంది కళ్ళు తుడుచుకుంటూ.

''ఇందతా ఎప్పట్నుంచీ?'' అని అడిగేను. అసలు నాకీ గొడవే తెలీదు.

''పదిహేను రోజుల క్రితం మీ చిన్నాన్న కూతురు పెళ్ళికి మీరందరూ కలిసి తిరపతి వెళ్ళేరు కదా...''

''తిరుపతి కెళ్ళిన వాళ్ళు నిక్షేపంలా పెళ్ళి చేసుకుంటారు. వెంకటేశ్వర స్వామి బ్రహ్మచర్యం బోధించలేదు, సన్యాసం బోధించలేదు. ఆయనకి పద్మావతి, అలువేలుమంగా, పీళ్ళు చాలక బీబీ నాంచారి....''

''మా అదృష్టం ఇలా ఏడిసింది. తిరపతెడితే ఆ ఏడుకొండలవాడి దయ వల్ల వీడి బుద్ధి కుదుటబడుతుందనుకున్నాను. తిరిగొచ్చిన రెండురోజులకి, మంచి సంబంధాలున్నాయంటూ ఓ శాస్త్రిలుగారు వీడి జాతకం పట్టికెళ్ళినట్టే పట్టికెళ్ళి మర్నాడు తిరిగిచేస్తూ....అదంతా ఎందుకులే!" అంటుంటే ఆవిడకళ్ళు మళ్ళీ చెమర్చాయి

"అసలెవడా శాస్త్రిలు?"

"ఎవరో! జ్యోతిష్యంలో కూడా పండితుట్ట. వొందరూపాయలు కూడా వాడి మొహాన్నకొట్టి వస్తోవని మంచి సంబంధాలేమైనా వుంటే చూడండి అన్నాను."

"సూర్యాన్ని కలుసుకుని మాట్లాడతా నుండు'' అన్నాను లేస్తూ.

''మాట్టాడ్డంకాదు, ఎలాగైనా నువ్వే ఏదో పిల్లను చూసి వాడికి ముడి పెట్టెయ్యాలి. కానీ కట్నం లేకపోయినా సరే, వీడికి పెళ్ళయితే చాలు. నేనీ బ్లడ్ ప్రెషర్ రోగంతో ఎన్నాళ్ళు బతుకుతాను? త్వరగా నువ్వీ పుణ్యంకట్టుకుంటే చచ్చి నీ కడుపున పుడతాను'' అంది మళ్ళీ కళ్ళు తుడుచుకుంటూ.

'సరే త్వరగా చావు. మా ఆవిడకి కడుపురాకుండా హిస్టిరేక్టమీ చేయించేస్తాను' అని మనస్సులో అనుకుని, ''అలాగేలే'' అంటూ బయపడ్డాను.

నేను మా యింటి కొచ్చేటప్పటికి సూర్యం మా యింట్లో శంకరంతో కూర్చుని ఏదో దీర్ఘాలోచనలో వున్నాడు. వాడి రూపురేఖలే మారిపోయాయి; ఆఖరి సీన్లో సలీంలా వున్నాడు. నన్ను చూసి లేచి యివతలకొచ్చేడు. నేను వాడింటి నించే తిరిగొస్తున్నానని చెప్పేను. వాడు అసలే సూక్ష్మగ్రాహి. ఎంత కావాలని వాడూ, యింత కావాలని నేనూ సంజ్ఞలు చేసుకున్నాం. క్షణంలో వాడి జేబులోంచి ఓ ముప్ఫయిరూపాయలు మాయమై నా జేబులో ప్రత్యక్షమయ్యాయి. తర్వాత వాడి పెళ్ళి కోసం వాడి తల్లి ఎంత బెంగెట్టుకుందో వివరించేను.

''అవిడేడుపెలాగుందో నా జాతకం ఆలాగే వుంది'' అన్నాడు నిర్లిప్తంగా.

"అసలు ఈ జాతకాలు నమ్మమని ఎవడు చెప్పేడ్రా? విశ్వామిత్రు డంతటి వాడు జాతకాలు చూసి సీతకి రాముడికి పెళ్ళిచేస్తే వాళ్ళెంత సుఖపడ్డారో

చూశావుగా! వశిష్ఠుడు శ్రీరాముడికి పట్టాభిషేకం ముహూర్తం పెడితే ఆ ముహూర్తానికే అడవికి పంపించేరు అసలు ఈ భూమ్మీదున్న అయిదువందల కోట్ల జనాభాలోనూ జాతకాలు చూసి పెళ్ళాడే వాళ్ళెంతమంది?'' అన్నాను, నా వాగ్ధాటికి నేనే ఆశ్చర్యపోతూ.

"నమ్మకంలేక చూడకపోవడం వేరు, చూసిన తర్వాత నమ్మకపోవడం వేరు. వస్తా" అంటూ వెళ్లేడు.

ఇంట్లో అడుగెట్టగానే "ఏమిటండీ, ఏదో సూర్యంతో వీధిలో నిలబడి ఘర్షణ పడుతున్నారు! ఏ పేకాట కోసమేనా మీరు పుచ్చుకున్న అప్పు తీర్చమంటున్నాడా?" అంటూ కుశలప్రశ్న లేసింది మా ఆవిడ.

"అప్పుచేసి పేకాడాల్సిన ఖర్మం నా కుండదు. నా దెప్పుడూ విన్నింగ్ హేండ్" అన్నాను.

''అందుకేగా నన్ను చేబట్టేరు!''

''మాటిమాటికి ఆ విషాదగాథ జ్ఞాపకం చెయ్యకు. పాపం, సూర్యం తల్లి పుట్టెడు దుఃఖంలో వుంది. పెళ్ళి చేసుకోమని ఆవిడా; చేసుకోనని వీడూ.''

''ఎలా చేసుకుంటాడండీ? కట్నానికి ఆశపడి కొండముచ్చుల్లాంటి పిల్లల్ని వాళ్ళమ్మ సెలెక్ట్ చేసి చూడమంటుంటే!''

''ఇదివర కేం జేసిందో తెలీదు కాని, ఇప్పుడు కానీ కట్నం లేకపోయినా సరే వీడు పెళ్ళాడితే చాలంటుంది.'' అన్నాను.

"మరి కట్నం బాధ లేదన్నప్పుడు మీ చెల్లెలు శారదని చేసుకుంటాడేమో అడగండి. చదువుకుంది. చక్కగా వుంటుంది.''

''అసలు వాడు పెళ్ళే చేసుకోను మొర్రో అంటుంటే! వాడి జాతకంలో ఏదో దోషం వుందిట.''

''జాతకం లేదు గోంగూరా లేదు. మనం జాతకాలు చూసే పెళ్ళి చేసుకున్నామేమిటి?''

''నేను కులం వొకటి చూసుకు ఏడ్చేనా, జాతకం చూసుకోడానికి! పలకరించిన క్షణంనుంచీ పెళ్ళో పెళ్ళో అని ఊపిరాడకుండా తొందరగొట్టేశావు. అసలు నేను నిన్ను ప్రేమించేనో లేదో తేల్చుకోనైనా లేదు.''

‘‘మీరు తేల్చుకునీవరకూ పూరుకుంటే నన్ను ముంచేద్దురు. ఎన్ని కబుర్లు చెప్పేరు! ఎన్ని వేషాలేశారు!’’

‘‘మళ్ళీ ఆ ట్రాజడీ గురించి జ్ఞాపకం చెయ్యకు.’’

‘‘అందుకే యిప్పుడు కామెడీని సజెస్ట్ చేస్తుంట. వెళ్ళి, మీ చెల్లెల్ని పెళ్ళి చేసుకోమని అడగండి.’’

‘‘ఎలా అడగమంటావు? అసలు వాడు పెళ్ళే చేసుకోనంటుంటే!’’

‘‘అతని దగ్గరో పాతిక రూపాయలు అప్పడగటాని కెళ్ళేరనుకోండి. అతను లేవంటాడనుకోండి. మీరు తిరిగొచ్చేస్తారా? ‘నువ్విలాగంటే కుదరదు. నిన్నే నమ్ముకున్నాను. ఓవర్‌టైం అడయినా సరే పీకాల్లో సంపాదించి....’’

‘‘అదిగో మళ్ళీ....’

‘‘అబ్బ! మాటవరసకండీ.... అలా శతవిధాల ప్రాధేయపడతారా పడరా? మీ రడిగితే కాదనడు. ఇంక జాతకంలో దోషమా? నీ జాతకమెలాంటి దయినా మాకు పట్టింపు లేదు అని గట్టిగా దబాయించండి. దాంతో అసలు రంగు బయటపడుతుంది.’’

‘‘ఇన్ని పాఠాలు నువ్వు నాకు చెప్పకపోతే నువ్వే వెళ్ళి మాట్లాడొచ్చుగా? సూర్యం నీ తోనైతే నిర్మొహమాటంగా మాట్లాడుతాడు’’ అన్నాను.

‘‘ముందు మీరెళ్ళి ఫార్మల్‌గా ప్రొపోజ్ చెయ్యండి. ఆ తర్వాత మీ చెల్లెల్ని గురించి పొగడటం, మన ఆర్థిక పరిస్థితుల్ని గురించి వివరించడం, నేను పెళ్ళికొచ్చి వాళ్ళకు తలవంపులు తేనని హామీ యివ్వడం లాటివన్నీ చేసుకొస్తాను. కులం తక్కువదాన్నని అవిడకి నేనంటే మంట. శుభమా అని పెళ్ళి రాయబారానికి నేనే వెడితే అవిడ విరుచుకుపడుతుంది” అంది మా అవిడ.

“అయ్ అప్రీసియేట్ యువర్ డిప్లొమసి. కాని, నీ ఆత్మగౌరవాన్ని త్యాగం చెయ్యడం నేను భరించలేను.’’

“అలాంటి ప్రమాదమేమీ జరగదు. మీరు సూర్యం మంచితనాన్ని మరచి పోతున్నారు. నేను అవిడ మూర్ఖత్వాన్ని దృష్టిలో పెట్టుకు మాట్లాడేను. లక్ష్యం మంచిదనుకున్నప్పుడు మార్గంలో అవకతవకలున్నా సరిపెట్టుకోవాలి. ఏమంటారు?”

''ఏమిటనేది, నా బొంద! నిన్ను పెళ్ళాడిన తర్వాత ఏనడమేకాని అనడం ఎరుగుదునా?'' అన్నాను.

*　　　*　　　*

మా ఆవిడ అజ్ఞానుసారం మర్నాడు ఉదయం సూర్యం యింటికెళ్ళేను. తల్లీ కొడుకూ యింట్లోనే వున్నారు. మా శారదని సూర్యం చేసుకుంటాడంటే వెంటనే మా నాన్నగారికి రాస్తాను నీ అభిప్రాయం నిర్మొహమాటంగా చెప్పు"మని వాడి తల్లినడిగాను. ''బంగారం లాంటి సంబంధం, నేను మీ కట్నాలూ కానుకలూ ఆశించినదాన్ని కాను. వాడు చేసుకుంటానంటే రేపే ముహూర్తం పెట్టించు'' అంది. నా చెవులు నేనే నమ్మలేకపోయాను.

''క్షమించు, నా కిష్టంలేదు'' అన్నాడు సూర్యం, లేస్తూ.

"పెళ్ళిష్టం లేదా? ఈ సంబంధం యిష్టం లేదా ? నిజం చెప్పు'' అన్నాను వాడి జబ్బ పట్టుకొని మళ్ళీ కుర్చీలో కూలేస్తూ.

"ఆల్ రైట్. అయితే విను. నాకు పెళ్ళి యిష్టమే. మీ చెల్లెల్ని చేసుకోడమూ యిష్టమే. కాని, అంత్య నిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరం మంచిది. ఇప్పుడు నువ్వొప్పుకున్నా చివరికి నువ్వే వొద్దంటావు. అందుకే ముందే యిష్టం లేదంటున్నాను'' అన్నాడు సూర్యం.

''ఇష్టమంటావు నిష్ఠూరమంటావు వొద్దంటావు; ఏమిట్రా నీ పిచ్చిదోరణి? ఈ భయమంతా నీ జాతకం గురించే?'' అన్నాను.

"అదేరా బాబూ! ఆ జాతకందెయ్యం వాణ్ణి పట్టి పీడించేస్తుందనుకో. నిద్రాహారాలు లేక బెంగతో చిక్కి శల్యమౌతున్నాడు. ఏం చెయ్యాలో నాకేం పాలుపోవటం లేదు'' అంది చీరచెంగు నోట్లో కుక్కుకుంటూ.

''ఏం చెయ్యడమేమిటి? పెళ్ళి చెయ్యడమే! దాంతో దయ్యం వొదులుతుంది" అన్నాను ధీమాగా.

"మా జాతకాలు చూడకుండానే మీ నాన్న గారు యీ పెళ్ళికి ఒప్పుకుంటారా?' అడిగేడు సూర్యం.

''ఓయస్. అసలు జాతకాలు ప్రసక్తే రానివ్వను" అన్నాను.

''అంతేరా బాబూ! ఈ చాదస్తాలన్నిటికి టైము లేకుండా ఓ దగ్గర ముహూర్తమేదైనా చూడు" అంది ఆవిడ.

''అమ్మా! ఎంత దారుణాని కొడిగడుతున్నావు?"అన్నాడు సూర్యం తల్లి కేసి చురచుర చూస్తూ.

''నామీద విరుచుకుపడతా వేమిట్రా: వాళ్ళ కభ్యంతరం లేదంటున్నాడు. నీకూ యిష్టమైతే ముహూర్తం పెట్టమన్నాను''అంది ఆవిడ బిక్కమొహం వేస్తూ.

''ఆలోచించుకు చెప్తాను" అన్నాడు, సుప్రీంకోర్టు జడ్జిమెంట్ కోసం వేచివుండుడు అన్న పక్కీలో.

ఇంటికి తిరిగొచ్చి తూచ తప్పకుండా ఈ డైలాగ్‌లన్నీ మా ఆవిడకి వినిపించేను. "ఏమిటీ! మీ ఆర్గ్యుమెంట్స్‌తో వాళ్ళిద్దర్నీ హడలగొట్టేశా రన్న మాట! మీ వాగ్ధాటికి మీరు లాయరయి వుంటే సుప్రీంకోర్ట్ జడ్జిగా రిటైరవుదురు. జాతకంలో ఏదో లోపం వుండి బేంక్ గుమాస్తా అయ్యేరు'' అంది, టిఫిన్ బాక్సెస్ సర్దుతూ. ఎందుకో ఆ మాటల్లో అభినందన కంటే వ్యంగ్యమే ధ్వనించింది. "స్కూల్ టీచర్ని కట్టుకునే యోగం వుంటే ఏమవుతాన్లే!" అన్నాను, నేనూ బట్టలు మార్చుకోడాని కుపక్రమిస్తూ.

* * *

ఆచారింట్లో పేకాట్లో పడి సాయింత్రం యింటికి రావడం ఆలస్యమైంది. రాగానే ''ఎంత మైనస్సు?" అంటూ మా ఆవిడ పరామర్శించింది. "మైనస్సా? నాన్‌సెన్స్! ప్లస్సే'' అంటూ ఎంత మైనస్సో లెక్కెట్టుకుంటున్నాను.

'కంగ్రాచ్యులేషన్స్" అంది మా ఆవిడ.

"ఈమాత్రం దానికే? ఆఫ్టరాల్ ట్వెల్వ్ రుపీస్'' అన్నాను పీలైనంత సంతోషం నటిస్తూ.

''మీకు ప్లస్సేమిటి నా మొహం? మీతోకూడా ఆడి డబ్బుపోగొట్టుకున్నాడంటే వాడికి పేకాట రాదన్నమాట! ఇంతకీ కంగ్రాట్స్ అందుక్కాదు, మీ శారదకి పెళ్ళి కుదిరింది. సూర్యం ఒప్పుకున్నాడు. మీ శ్రమ ఫలించింది" అంది ఆనందంతో పొంగిపోతూ.

''నిజంగానా? హౌ వండర్‌ఫుల్! వాట్ న్యూస్! ఎప్పుడు చెప్పేడు?''

''సాయింత్రం వాళ్ళింటి కెళ్ళాను. మీ మాటలు విన్నాక తారెత్తిపోయి జంటగానూ విడివిడిగానూ ఆలోచించుకుని చివరికి ఈ సంబంధాని కొప్పుకున్నారుట. అయితే, మూడు షరతులు సూర్యం పెట్టేడు.''

''ఏమిటవి?''

"మొదటిది- అతి స్వల్ప ఖర్చుతో నిరాడంబరంగా పెళ్ళి జరపాలట.''

"దానికేం? వొద్దంటే పురోహితుడు, బ్యాండు, భోజన ఫలహారాలు కూడా మానేస్తాం. నెక్స్ట్?''

''వెంటనే పెళ్ళిచూపు లిక్కడే ఏర్పాటు చెయ్యమన్నాడు. పిల్ల నచ్చక పోవడం ప్రశ్న లేదు. అయితే, పిల్లతో పది నిమిషాలు ఏకాంతంగా మాట్లాడ తాడుట."

''నిరభ్యంతరంగా. వాడు చెప్పిన వాటికన్నింటికీ సరే అనమని శారదకి బ్రీఫ్ చేద్దాం. నౌ ది లాస్ట్?"

"పెళ్ళి ముందుకాని, పెళ్ళిలో కాని, పెళ్ళి తర్వాత కాని అతని జాతకం చూపెట్టమని అడక్కూడదట."

"వాడి కసలు జాతకం వున్నట్టే చెప్పద్దు.'' అన్నాను.

''హమ్మయ్య! ఇప్పుడు నా ప్రాణం కుదుటపడింది. మొదటి షరతు మనకి సమస్య కాదు. రెండో షరతు విషయంలో శారద కేదో నచ్చచెబుతా మనుకోండి. మూడో షరతు విషయంలో మీ నాన్న గారేంపట్టుదలగా వుండ కుండా చూడాలి.'

''యూ లీవిట్ టు మి. నేను మేనేజ్ చేస్తాను. ధైర్యం పురుష లక్షణం'' అంటూ మా విడకి ధైర్యం చెప్పేను.

''ధైర్యే సాహసే పెళ్ళి అన్నారు. మొత్తం మీద సాధించేరు.'' అంది.

''ఇందులో నీ సహకారం, ప్రోత్సాహం కూడా వున్నాయ్'' అని అవిణ్ణి ఉబ్బేసేను.

* * * *

పెళ్ళి చూపులు మా యింట్లోనే ఏర్పాటు చేశాను. వాళ్ళిద్దరూ కాస్సేపు ఏకాంతంగా మాట్లాడుకుంటూ మన్నారు. నా ప్రాణాలు టివ్వుటివ్వు మంటూ వున్నాయి. ''ఈ షరతుకి ఒప్పుకోకుండా వుండవల్సింది. ఇప్పుడు ఆ సూర్యం మా శారదతో జాతకం పాతకం అంటూ ఏం భయపెడతాడో ఏమిటో! కాస్త శారదకి ధైర్యం చెప్పేరా లేదా?" అంటూ మా అవిడ నిలదీసి అడుగుతుంటే.

నా అజాగ్రత్తకి నా ప్రైప్రాణాలు పైకి పోయేయి. ప్రాణాలు అరచేతిలో పట్టుకొని క్షణాలు లెఖ్ఖపెడుతూ కూర్చున్నాను. వాళ్ళిద్దరూ మౌనంగా మళ్ళీ హాల్లోకొచ్చి కూర్చున్నాక నేను సూర్యం ఇచ్చే జడ్జిమెంటుకోసం ఎదురుచూస్తూ బిక్కుబిక్కుమంటూ వాడి మొహంకేసి దీనంగా చూశాను. వాడు నాతో బయటకి నడిచొస్తూ "ఆల్‌రైట్, ముహూర్తం త్వరగా పెట్టించెయ్యి. ఇదిగో ఇది నీ దగ్గిరుంచుకొని పెళ్ళికి ఖర్చుపెట్టు'' అంటూ వందరూపాయల నోట్లకట్ట నా జేబులో పెట్టేడు. తిరిగిచ్చెయ్యటానికి ఎంత ప్రయత్నించినా వాడొప్పుకోలేదు. తీసుకోకపోతే పెళ్ళి చేసుకోనని బెదిరించేడు. వాడి అభిమానానికి, ఆదరణకి నాకు కళ్ళనీళ్ళపర్యంతం అయింది.

అంతా విని "ఎలాగైనా మీరు దేవాంతకులండి అనుకున్నపని సాధించేరు" అంది మా ఆవిడ నన్ను అభినందిస్తూ. "నేను పూనుకొని ఈ పెళ్ళి జరిపించడమంటే, నేను నిన్ను పెళ్ళాడిన మహాపాపానికి నిష్కృతన్నమాట!'' అన్నాను మా ఆవిడ బుగ్గమీద చిటికేసి, మనస్సులోనే మీసం మెలేస్తూ.

పెళ్ళి రేపనగా మా నాన్న ''ఇదంతా శారద పూర్వజన్మ సుకృతం, నీ ప్రయోజకత్వం, సూర్యం అభిమానం, మా అదృష్టం, లేకపోతే జానికమ్మ కట్నం లేకుండా కొడుక్కి పెళ్ళి చేస్తుందా! అందులోనూ మన సంబంధం ఒప్పుకుంటుందా? అది సరే, సూర్యం జాతకం పంపమంటే పంపలేదేమిట్రా? పోనీ, యిక్కడైనా ఎవరికేనా చూపించేరా?' అని అడిగేడు. నాకు ముచ్చెమటలు పోశాయి.

"చూపెట్టేమండి, చాలా బాగా నప్పేయి'' అంది మా ఆవిడ.

''సూర్యం డేటాఫ్ బర్త్ నాకు తెలుసు. మన వూళ్లోనే కస్తూరిబా నర్సింగ్‌హోంలో అర్ధరాత్రి పుట్టేడు. టైం సరిగ్గా తెలీదు, పోనీ, నక్షత్రం చూసి జాతకచక్రం వేద్దామంటేను. నీ దగ్గరుందా వాడి జాతకం?'' అని అడిగేడు. ఆయనసలే జాతక పిపాసి.

"ఇప్పుడావిడి జాతకం ఎక్కడ దాచిందో....అడిగితే ఏం బావుంటుందీ?'' అంటూ నసిగేను.

''జాతకం లేకపోతే లేకపోయింది. తన కెన్నిగంటలకి కాన్పొచ్చిందో జానికమ్మకి తెలియదంటుందా? ఉండు, నే వెళ్లి....''

''అక్కర్లేదు మామయ్యగారూ! ఇదిగో నాదగ్గరుంది'' అంటూ మా ఆవిడ జాతకచక్రం వున్న కాగితం మానాన్న కందించింది. మా ఆవిడ లెక్కల టీచరు. బడ్జెట్టు, ఎక్స్‌పెండిచరూ, ఇన్‌కం, సేవింగ్సూ అంటూ లెక్కలు కట్టడం వరకూనే తెల్సుననుకున్నాను కాని, లెక్కలు కట్టి జాతకాలే మార్చేస్తుందని నాకు తెలియదు. దాంతో ఓ పావుగంట కుస్తీ పట్టి ''భేష్, మాదొడ్డ జాతకం'' అంటూ తృప్తిపడ్డాడు మా నాన్న. నాకు మళ్ళీ శ్వాస మొదలెట్టింది.

పెళ్ళయిన మూడోరోజున మా అమ్మా నాన్న మా వూరెళ్ళిపోయారు. సూర్యం శారదని తీసుకొని హనీమూన్ కెళ్ళిపోయాడు. నేనూ మా ఆవిడా పెళ్లి ఖర్చులు లెక్కలు వేసుకు చూసుకుంటున్నాం. ఆ సమయంలో విభూతి పిండికట్లతో, భుజంమీద శాలువాతో ఓ బ్రాహ్మడు దిగేడు. "ఇదంతా మీ చలవే, మీ సహాయంవల్లే పెళ్లి దిగ్విజయంగా జరిగింది'' అంటూ ఓ తాంబూలంలో వందరూపాయలూ, ఓ కాయితం పొట్లంలో మిఠాయి మినపసున్ని వగైరాలు ఆయన చేతుల్లో పెట్టింది. "దీర్ఘ సుమంగళీభవ. అమ్మా నూరబద్ధాలు ఆడైనా ఓ పెళ్లి జరిపించాలన్నారు. మీ సంకల్పం మంచిది. అందుకే దైవానుగ్రహం కూడా తోడయింది. వస్తా, శలవు" అంటూ ఆశీర్వదించి అంతర్ధాన మయ్యేడు.

''దొంగ జాతకం ఈ బ్రాహ్మడేనా రాసింది?'' అని అడిగాను.

"దొంగజాతకం రాయలేదు, మాట సహాయం చేశాడు.''

"అంటే-జానికమ్మగార్నీ సూర్యాన్నీ జాతకంలో దోషం ఉంది, పెళ్ళి చేసుకోవద్దు అని భయపెట్టేడన్నమాట! అవునా?"

''పేకాడుతూ కూర్చుంటేనూ, రాయబారాలవల్లా, వాగ్ధాటి ప్రదర్శనవల్లా మీ చెల్లెలు పెళ్ళయిందనుకుంటున్నారా? ఓ ఆదర్శాన్ని లక్ష్యంగా పెట్టుకున్నప్పుడు దానికో పథకం ఆలోచించాలి. ఆ పథకాన్ని అమలు జరుపాలంటే కార్యధ్యక్షత కావాలి....''

మా ఆవిడ మాటల్తో నాకు జ్ఞానోదయం అయింది. నేను తెరముందు జరిపిన రాయబారానికి వెనకాల ఏదో కుంభకోణం వుందన్నమాట! అంటే, ఈ నాటకంలో నాది కేవలం ఒక డమ్మీపాత్ర. ఆలోచించిన కొద్దీ జవాబు తెలియని ఎన్నో ప్రశ్నలు ఎదురయ్యేయి.

"ఓ రాణీ! ఈ బ్రాహ్మడెవరు? ఆయన చెప్పిన జోస్యం ఏమి? జానికమ్మ ఈ సంబధాని కెందుకొప్పుకుంది? సూర్యం శారదాకి ఏకాంతంలో ఏం చెప్పేడు?

అసలు ఈ నాటకంలో నీ పాత్ర ఏమి? ఈ సందేహాలు నన్ను వేధిస్తున్నాయి. వీటికి సమాధానాలు తెలిసివుండీ చెప్ప పోయావా నీ శిరస్సు వేయి వ్రక్కలవుతుంది" అని శపించేను.

"హే బేతాళా! నేను చెప్పను. ఈ రహస్యం బయటపడిందంటే మీ చెల్లెలు కాపురం వేయి వ్రక్కలవడం ఖాయం."

"రహస్యం బయట పెట్టనని ప్రమాణం చేస్తున్నాను. ఇక నీ తల కాచుకో." అన్నాను.

"సరే విను. ఆ బ్రాహ్మడెవరో నాకు తెలీదు. ఓ పేద బ్రాహ్మణ్ణెవణ్ణయినా తీసుకురమ్మంటే మీ తమ్ముడు శంకరం ఈయన్ని తీసుకొచ్చేడు. మీకెంత జ్యోతిష్యం వొచ్చునో ఆయనకీ అంతే వొచ్చును. ఆయన చెప్పిన జోస్య మేమిటంటే. సూర్యం జాతకంలో ద్వికళత్ర యోగం వుందనీ, ప్రథమ భార్య త్వరలోనే వరకుపడిస్తుందనీ సకలైశ్వర్యాలూ సంతానయోగం ద్వితీయం వల్లనే సంక్రమిస్తాయని. అంచేత ఇది ప్రథమం కాబట్టి త్వరగా యిది పూర్తి చేయించేసి ద్వితీయం కోసం ఎదురుచూద్దామన్న సత్సంకల్పంతో జానకమ్మ ఒప్పుకుంది. సూర్యం శారదతో ఏకాంతంలో ఎట్టి పరిస్థితుల్లోనూ మనం యిద్దరం యిష్టపడి పెళ్ళి చేసుకున్నామని మా అమ్మకు తెలియనివ్వొద్దు, పెళ్ళయిన తర్వాత కొన్నాళ్ళు నేను ముభావంగానూ, దిగులుగానూ వున్నట్టు నటిస్తాను. నువ్వు కంగారు పడొద్దు. మీ వొదినంటే (అంటే నేను) మా అమ్మకు వొళ్ళు మంట. అంచేత మీ వొదినతో కొన్నాళ్ళపాటు ఎక్కువ రాసుకుపూసుకు తిరగొద్దు' అని బోధించేడు. ఇంక ఈ నాటకంలో నా పాత్ర ఏమిటంటే-శంకరంతో చెప్పి సూర్యాన్ని మీ చిన్నాన్నగారి కూతురి పెళ్ళివంకని తిరపతి రప్పించేను. మీ చెల్లెల్ని అతనికి పరిచయం చేశాను. రెండు రోజులు వాళ్ళిద్దరూ రహస్యంగా ప్రేమపాఠాలు వల్లించుకునేటట్లు కూడా తిప్పమని శంకరానికి పురమాయించేను. తదనంతరం మేము నలుగురం ఆలోచించుకుని ఈ నాటకం ఆడేం. ఇంకా అడగవల్సిన ప్రశ్నలేమైనా వున్నాయా?" అంది.

"నీకు సమాధానం తెలియని ప్రశ్న ఒకటే వుంది. కట్టుకున్న మొగుణ్ణొక బఫూన్ కిందచేసి ఆడించిన నీలాంటి పెళ్ళాని కెలాంటి శిక్ష విధించాలి?" అంటూ మీదకి లంఘించేను. *

('యువ' దీపావళి ప్రత్యేక సంచిక, 1983)